# అవ్వా..బాగున్నావా..

- టైమ్‌కి పింఛన్ వస్తుందా..
- వృద్ధులను ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కాసిపేట : కొండాపూర్ యాపలో బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న గ్రామస్తులతో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని

నెన్నెల, నవంబర్13: 'అవ్వా బాగున్నావా..' అంటూ తియ్యటి పిలుపుతో చలికి నెగడి కాగుతున్న వృద్ధురాలు ఒక్కసారిగా తిరిగి చూసింది. 'ఎవలు బిడ్డా నువ్వు.. సక్కగా కనబడుతలేదు' అంటు మూలుగు కుంటు కండ్లు చేతితో తుడుచు కుంటు నిండుగా చూసింది. అగో బిడ్డా చిన్నయ్య నువ్వా కోడుకా' అంటూ లేవ పోయింది. 'లేవకు అవ్వా అక్కడే ఉండు నేనే వస్తున్నా' అంటూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం ఉదయం ఏడున్నర గంటలకు నెన్నెలలోని కొత్తగూడానికి వెళ్లగా అక్కడే చలికి చలి మంటలు కాగుతున్న దుర్గం పోషక్కను ఎమ్మెల్యే పలుకరించారు. 'అవ్వా ఆరోగ్యం బాగున్నదా.. నెల నెలకు టైమ్‌కి పింఛన్ వస్తుందా..' అని ఎమ్మెల్యే అడిగారు. 'నెల నెలా పింఛన్ మంచిగానే వస్తుంది బిడ్డ..పొలంలా పండిన బియ్యం ఉన్నయ్ మంచిగానే ఉంటున్నమ్..' అన్ని అన్నది. మీకు పింఛఉన్ సరిపోతలేదని కేసీఆర్ సార్ డబుల్ చేస్తుండు. మీరంతా సారును మళ్లా సీఎంను చేయాలే. సారు మళ్లా గెలిస్తే ఇంకా మంచి పథకాలు తెస్తడు. అనగానే ఆ వృద్ధురాలి కండ్లలో నీళ్లు చెమ్మగిల్లాయి. 'కేసీఆర్ సారే మాకు దేవుడు అయ్యిండు బిడ్డా. తప్పకుండా కేసీఆర్‌ను గెలిపిత్తం' అంటు చిన్నయ్య ను ఆప్యాయంగా వెన్నుతట్టింది.

**కొత్తగూడేనికి బీటీ రోడ్డుకు రూ.కోటి మంజూరు..**

కొత్తగూడెం గ్రామానికి బీటీ రోడ్డు రూ.కోటి మంజూరయ్యాయని, రెండు నెలల వ్యవధిలో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య తెలిపారు. సోమవారం గ్రామంలో ప్రచారంలో భాగంగా యువకులతో బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను వివరించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మితే మోసపోతామని తెలిపారు. బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ తోట మధు, మండల కోఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, గ్రామస్తులు ఉన్నారు.

**గెలిపిస్తే..మరింత అభివృద్ధి చేస్తా..**

కన్నెపల్లి, నవంబర్ 13 : ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే నాయకులను ప్రజలు నమ్మవద్దన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మిమోసపోతే ప్రజలు గోస పడతారని, ఆలోచించి అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓట్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నియోజక వర్గ అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నారు**

బెల్లంపల్లి, నవంబర్ 13: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీకి చెందిన వంద మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం స్థానికంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో ఈ సారి బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నెన్నెల : వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

**బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు మద్దతు తెలుపాలి**

**- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత**

కాసిపేట, నవంబర్ 13 : బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత పేర్కొన్నారు. సోమవారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాప వడ్డెర కాలనీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకొని వారితో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకటేశ్ నేతకాని మాట్లాడుతూ అనేక పథకాలు అమలు చేసుకోవడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది, బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని, మరో సారి మద్దతు తెలిపి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధితో పాటు రెట్టింపు సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. దీంతో గ్రామస్తులు వడ్డెర కాలనీ 'జై బీఆర్‌ఎస్' అంటూ మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, మదన్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ సభకు స్థల పరిశీలన



ఎమ్మెల్సీ దండె విఠల్‌తో మాట్లాడుతున్న డీసీపీ సుధీర్‌రాంనాథ్ కెకన్

జన్నారం, నవంబర్ 13 : ఈ నెల 17న జన్నారం మండల కేంద్రంలో ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు స్థలాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దండే విఠల్, ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ సోమవారం పరిశీలించారు. సభ స్థలాన్ని చదును చేయడం, వాహనాల పార్కింగ్, తదితర వసతులు కల్పించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, జిల్లా ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు మహ్మద్ రియాజొద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, ఫజల్‌ఖాన్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

**హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన డీసీపీ**

జన్నారం మండల కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించి కేటీఆర్ సభ స్థలాన్ని, హెలీప్యాడ్ ప్రదేశాన్ని, రోడ్డు డైవర్షన్‌ప్రాంతాలను మంచిర్యాల డీసీపీ సుదీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి పరిశీలించారు. సభకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట సీఐ కృష్ణ, ఎస్ఐ సతీశ్ ఉన్నారు.

## పటాకుల దుకాణాల తనిఖీ

లక్షెట్టిపేట, నవంబర్ 13: లక్షెట్టిపేట పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలను పట్టణ సీఐ కృష్ణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాల అనుమతి పత్రాలను పరిశీలించారు. విద్యుత్ అధికారుల సమక్షంలో వ్యాపారులు వేసుకున్న విద్యుత్ వైర్లను కూడా పరిశీలించారు. నాణ్యతగా లేకపోవడంతో మార్చుకోవాలని తెలిపారు. ప్రతి వ్యాపారి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంట ఎస్ఐ లక్ష్మణ్, లైన్‌మన్ మల్లేశ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.



బెల్లంపల్లి : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నెన్నెల : కొత్తగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య

# దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 13: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య ఆదివారం రాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో ఆయన పటాకులు కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. బజార్ ఏరియాలోని ప్రతి దుకాణానికి వెళ్లి వ్యాపారులు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**

తాండూర్, నవంబర్ 13 : మండలంలోని ప్రజలు దీపావళి పర్వదినం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించి, ఇండ్లు, దుకాణాల్లో పూజలు చేశారు. పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల్లో వీలైన విధంగా కేదారీశ్వరి వ్రతాలు చేశారు. పలువురు బొమ్మలు కొలువు నిర్వహించారు. తాండూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు బెల్లంపల్లిలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇంటికి వెళ్లి మొక్కలు, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

**వేమనపల్లి మండలంలో..**

వేమనపల్లి, నవంబర్ 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణాల్లో ఉన్న నివాసం ఉంటున్న వారు వేమనపల్లి మండలానికి చేరుకుని పండుగను నిర్వహించారు. కుటుంబ సమేతంగా కేదరేశ్వర వ్రతాలు, నోములు నోచుకున్నారు. ఇండ్లలో పిండి వంటలు చేసుకున్నారు. సాయంత్రం ఇండ్ల ముందు దీపాలు వెలిగించారు. ప్రతి ఇల్లు దీపాల కాంతులతో మెరిసిపోయింది. రాత్రి చిన్నారులు, పెద్దలు, యువకులు పటాకులు కాలుస్తూ ఉత్సాహంగా గడిపారు.

**కన్నెపల్లి మండలంలో..**

కన్నెపల్లి, నవంబర్ 13 : కన్నెపల్లి మండలంలోని గ్రామాల్లో ఆదివారం దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇండ్లలో కేదారేశ్వర వ్రతాలు, లక్ష్మీ వ్రతాలను, నోములను నోచుకున్నారు. ఇండ్లలో పిండి వంటలు చేసుకున్నారు. రాత్రి చిన్నారులు, పెద్దలు, మహిళలు పటాకులు కాల్చి పండుగను ఘనంగా నిర్వహించారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## 'నేను కచ్చితంగా ఓటు వేస్తా'




కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నస్పూర్, నవంబర్ 13 : భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన ఓటు హక్కు ద్వారా సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను (ఐ ఓట్ ఫర్ షూర్) ' ప్రదర్శన బోర్డును స్వయంగా ఫొటో దిగి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు,బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఈ నెల 30న పోలింగ్ నిర్వహించనున్నామని, అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వారి కోసం ఈ సారి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల అధికారి సంపత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.